వాన

“ఎల్లి జగ్గాయిపేట యెన్నంగ నేను పోతే
యెగరేసి వలపులు జల్లే దూడమ్మా, దూడ, దూడా
సిగదీసి కొప్పుపెట్టి, సిందూరం బొట్టుపెట్టి
నా అందం నవ్వి పోనూ దూడమ్మా, దూడ దూ.
రంగూరంగూలదూడ, పొంగుతూ ఎగిరే దూడ
కాళ్ళగజ్జెలదూడ, గంతూ చెంగూలదూడ.
దూడమ్మా, దూడ దూడా, దూడమ్మా, దూడ
దూడా!!”

ఈ పాట వానచినుకులశృతిలో కలిసిపోతోంది. చిన్న ఇల్లూ, చుట్టూ చిన్న ఆవరణ, ఆవరణచుట్టూ తాటాకుల దడి. ఆ దొడ్లో ఉన్నవన్నె పాదులు, పాదులమధ్యను బంతి చెట్లు, చెట్లపై బంగారు ముద్దపూలు. గుడిసె గుమ్మంలో నీలాలు కూర్చునిఉంది.

జుట్టు దువ్వుకోదు. బుక్కా రంగయ్యదగ్గర కొన్న కుంకుమబొట్టుమాత్రం సూర్యబింబంలా ఆమె నీలఫాలాన ఉదయారుణకిరణాలు వెదజల్లుతూ ఉంటుంది. వెడదలైన ఆమె కన్నుల్లో నవ్వులేదు. కంటికిపెట్టిన కాటుక, కన్నీటితో నున్ననైన ఆమెచెక్కులమీద మరిన్ని నలుపురంగులు రచించింది.

ఆమె కూర్చున్నమూర్తిలోనే అతిదీనత్వం అలుము కొనిపోయింది ఆమెగుండెలో గాధ కడుపులో చెయ్యేసి

కలిసిపోసినట్లయి, నిదరల్లె ఆమెబళ్ళు నీరసిస్తోంది. బిగువై, సుందరమై, పూర్ణమైన నవయౌవనంలో తీరనిఆవేదన సర్వమునూ శుష్కింపచేస్తున్నది.

తీయని తన మధురకంఠం జీరవోవ ఆమె పాట సాగించింది.

అద్దరూపాయిపెట్టి అద్దాలరవిక కొంటే,
రవికన్నా చిరగలేదే దూడమ్మా, దూడ దూడా
కోటప్పతిరణాలెల్లి కోరిన సవరం తెస్తె
కొప్పన్న మాయలేదే దూడమ్మా, దూడ దూడా!
మూడురూపాయలెట్టి ముత్యాలపాపటబొట్టు
బొట్టన్నా చెరగలేదేదూడమ్మా దూడా!

ఆమెజీవితమంతా నిండిపోయినాడు ఉప్పరి నాగన్న. నాగన్న పొడుగాటి కోరతలపాగా అందగాడు. గిరజాలు, పెద్ద ముడిజుట్టు. కాఱు నల్లరాతిబండల బలంతిరిగిన వయసు కాడు. వెండిబిళ్ళలతాడు. బంగారుమురుగులు, బంగారు దండకడియం, ఎడమచెయ్యి పైభాగంలో మాయపచ్చ. బిందువు వేలాడు బంగారుపోగు, ఎఱ్ఱరాళ్ళ తమ్మంట్లు. శుభ్రమైన ముదుకపంచి ఎగదోసి కట్టుకొన్న పనితనం.

ఈలా, తనకు మొదటిసారి ప్రత్యక్షమైన నాగన్న అద్భుతరూపం నీలాలకళ్ళల్లో మెఱపుమెరిసింది. ఆనాడు అతగాడు పాటపాడుతూ తన తండ్రిగారిపొలంలో తనకు తారసిల్లాడు.

"బెజవాడ చిన్నదానా, బాజూ బందూలదానా.
బాజూబందూలమీద, మనసేల లేదే ఓచిన్నదానా,

తన్ను చూచి అతను ఆగాడు. పాట ఆపాడు. నీలాల గుండె కొట్టుకుంది. పైకుబికి రానివ్వకూడని రహస్యభావాలు ఆమెలో ఎక్కడో పెద్ద ఏకులా బయలుదేరినవి. బిగువుగా తొడుగుకున్న పీతరవికక్రింద స్నిగ్ధాలై వర్తులవులై బిగువైన ఆమె వక్షాలు రవికఖైదును పగులకొట్టి బయటికి వచ్చి నట్లయినవి.

కమ్మని రంగురంగు నేలలున్న భూదేవికి వారుఅనుగు బిడ్డలు. వారిపెద్దలు, ఆ కన్నతల్లిలోని ప్రేమను చూరగొన్న ఉప్పుకులు, నల్లరేగడులు, ఎర్రచెక్కలు నీలెకుప్పు ఒండ్రు బంగారాలు, తెల్లని గండ్రయిసుకలు, బంగారు సన్నఇసుకలు నిండిపోయిన ధూళిరంగు చౌటిపర్రలు వారి గునపాలచే పారలచే మథింపబడ్డవి.

భూదేవిలోని రహస్యాలు, ఆమెకర్కశత్వం, ఆమె లోని కరుణ వారికి తెలియునట్లు ఇంకోరికి ఎట్లు అవగతమవు తుంది. ఆమెలోని రసజ్ఞత్వము వారు నూతులుకట్టి పైకి తెత్తురు. ఆమెలోనిమహదైశ్వర్యము గనులుదింపి లోకానికి అర్పింతురు. ఆమె దివ్యప్రేమను కాలువలు త్రవ్వి దేశ దేశాలు ప్రవహింపజేతురు. గుళ్ళుగా, గోపురాలుగా భూలక్ష్మికి నూతనాలంకారాలు వారు సమర్పింతురు.

భూసంతానమైన వారిబిడలు సకల సుగంధాలను మలయానిలునకు అర్పిస్తూ ఉందురు. అందానికి మూలమైన విశ్వంభరానిధినుంచే వాళ్లు సకల సౌందర్యాలను సేకరింతురు.

ఆ ఉప్పర్లకులంలో వాళ్ళిరువురూ ఉత్తుంగశిఖరాలు.

ఆమెచూపులు ఆతనిపై; అతని చూపులు ఆమెపై; చూపులలో చూపులు కలిసినవి. అతడు మరిపించిన యౌవన సింహము; ఆమె నూర్ల తారుణ్యశోభావతియైన ఆడ సింహము! ఆమెనుచూచి అతడు అనుకున్నాడు.

"పలకనైన పలకవే పంచదార చిలకవే"

అతనిని చూచి ఆమె అనుకున్నది.

"ఓరోరి! నా బావ, ఒయ్యారి నా బావ!
మబ్బులిల్నించి దిగివస్తావా! మాయదారి నా బావ!
మబ్బులిల్నించి, దిగివస్తావా!"

2

ఒక పెద్దజట్టుకు నాయకుడై, అయిదెకరాల మాగాణికి, ఆరెకరాల మెరకకు భూపతియై, నాలుగు రెండువందల యాభై రూపాయల ఆదాయంరాగా, మెరకఊళ్ళలో ఏ నుయ్యో, పల్లపుఊళ్ళలో ఏ చెరువో త్రవ్వకంట్రాక్టు పుచ్చుకొనిగాని, ఏ రోడ్లు బాగుచెయ్యడమో, ఏ క్రొత్త రోడ్లు వెయ్యడమో బోడ్డు కంట్రాక్టరువద్ద త్రవ్వపని ఒప్పుకొనిగాని నాలుగు వందరూపాయలు పైగా సంపాదించే, హనుమన్న తనకు ఏకైకపుత్రికయైన నీలాలుకు మంచిసంబంధం తీసుకురావాలని ఊళ్లూ నాళ్లూ గాలించి వెదికాడు. వేరుదారైనా ఇంటికి వచ్చిన పసువును తెచ్చుకోమని—తనజిల్లా దాటి, వేరుజిల్లాలకు వెళ్ళి, ఒక జట్టుకు నాయకుడై, నాలుగు ఎకరాల మాగాణిభూమిమీద నాలుగు నూటయాభై రూపాయల ఆదాయంకలవాడునూ్నా, అందగాడునూ్నా, త్రవ్వపని

వల్ల సుమారు నూరురూపాయలు ఆదాయము తెచ్చుకొనే వాడునూ అయిన నాగన్నను అల్లుడుగా ఎన్నుకున్నాడు హనుమన్న.

పెళ్ళయి క్రొత్తగా అత్తవారింటికి వచ్చిననాటి సంగతులన్నీ జ్ఞాపకానికి తెచ్చుకుంది నీలాలు—

నాగన్న భార్యనుచూచి ఉప్పొంగిపోయాడు. తన అందానికి తగిన అందాలపడుచు. పొద్దస్తమానాలూ ఉప్పొంగిపోతూ పాటలు పాడుకొనేవాడు—

"చిన్నదాన, చిన్నదాన, వన్నెల వలపుదాన!
కన్నుల నలువుదాన, పన్నుల తెలుపుదాన!
చిన్నారి సిగ్గుదాన, యెన్నెల యెనుగులోన
తిన్నంగ తేలిపోదాం ఓ సిన్నిదానా!
ఓ సిన్నిదానా!

అని నీలాలుని సందిట్లో బిగించుకొని, వెన్నెట్లో, ఇంటిదగ్గిరనుంచి ఉప్పుటేరుకు తీసుకుపోయ్యేవాడు.

"నీకు నాకూ జోడుఐతే మల్లెపూల తెప్పగట్టి
తెప్పమీదా తేలిపోదాం పదవే
చల్ చిన్నారిపడుచా తెప్పమీదా తేలిపోదాం పదవే"

సిగ్గుతో నీలాలు అప్పుడు ముసిముసినవ్వులు నవ్వుకున్నది. నాగన్న మెడచుట్టూ చేతులు గట్టిగా బిగించి, అతని వెడదయైన రొమ్ములో తనమోమును గట్టిగా అదుముకొన్నది.

"ఏటే ఆలోసిస్తున్నావు? ఈపళంగా పడవఏసుకొని మన మిద్దరమే ఎల్లిపోతావుంటే నీ మొగంసూత్తూ అంతా మరిసిపోయి, ఏళ్ళు ఏళ్ళు గడిపేసుకోగలన్న"

"ఏరంటే నాకు బయంవత్తాది బాబూ!"

"మరి యీావంటే భయంలేదు?"

"నువ్వంటే బయంలేదు"

"అల్లాగా! సూత్తావుండు. ఎమికలు ఇరిగేటట్టు నొక్కేత్తా. ఆ బుగ్గలుకొరికేసి తినేత్తా. నేను పొలంఎల్లి వొచ్చేటప్పటికి కూడొండకపోతే చెమడాలెక్కనాగేత్తాను."

"నువ్వు పొలంఎల్లి వొచ్చేటప్పటికి బొచ్చిచేపకూర వొండి సిద్దంగావుంటే నన్నేం సేస్తవు?"

"ఏం సేస్తనా! కడుపునిండా చేపలకూరేసుకు తినేత్తాను. నిన్ను హాంఅని మింగేత్తాను."

"ఓ సబ్బ! నాకు బయమేటి? నీ కడుపులోనే నేను దాక్కుంటేను"

"నాకడుపులోంచి గుండెల్లోకి పోతావేంటే నీవు?"

"అవును బావా! నీ గుండెలూ నింపుతా, నీ నిలువెల్లా నిండిపోతా"

"కూరలో నేనుంటె, కూడుమింగి నేత్తె,
గుండెల్లొ చేరుకుని కునుకుతీత్తుంటాను,
నా బావా!"

గుండెలో దాగుంటె, కోటిరాజ్యాలేలి,
ఆకాశమంతెదిగి, అందాలుతవ్వుతా,
నా పిల్లా! చందురుణ్ణి తెత్తానా పిల్లా!"

3

అలాంటి తనదొర, తన రాజు, తనబావను పెద్దరయితు దురన్యాయంగా ఖైదులో వేయించాడు గదా? దేవుడునేడా! అమ్మవోరునేడా? ఆ ఆలోచనలకి అడ్డంవచ్చాడు, ఉప్పరిసెలమయ్య. ఆ రోజు పొలం ఆక్రమించుకోడానికి పెద్దరైతువానలోనే పదిమంది పాలేళ్ళతో వస్తున్నాడని సెలమయ్య కబురు చెప్పినాడు—వాననీరు కారిపోతుండగా తుడుచుకొంటూ ఒగర్చుకొంటూ.

ఆ మాటలు వినడంతోటే నీలాలు ఆడవేటకుక్కలా లేచింది.

"ఓరన్న, గూడెంఅంతా సెప్పరా!" అన్నది. మూలనున్న దుడ్డుకఱ్ఱపుచ్చుకొని బయలుదేరింది.

వానజడితో వియ్యమందుతూన్న కంటనీరుమాయమై పోయింది. సివంగిలా ముందుకుసాగి నడిచింది. పొలంగట్టు మీదనుంచుంది. ఇంతట్లో ఒకవైపునుంచిఉప్పర్లు వచ్చారు. మరోవైపునుంచి పెద్దరైతూ అతనిపాలేర్లూవచ్చారు. నీలాలు కళ్ళల్లో ఎరుపులూ, పెద్దరైతుగుండెల్లో చీకటిపొగలూ కమ్మాయి.

"నా పొలంలో ఏ వెధవ అడుగెడతాడో ఆణ్ణి సంకేసి అక్కడే పాతేత్తాను." అంది నీలాలు.

పెద్దరైతు మీసాలు రెండూ కోపంతో వణికిపోయాయి "ఆడలంజకి ఎంతపొగరూ? దీన్ని మొగుణ్ణి పొగరణచినట్లు దీన్ని అణచాలి. ఈయాళకిఊరుకొంటున్నాను. రేపొద్దున్న

అడ్డంవచ్చావా, పదిమందిలో నీ సీర వొలిచి వోతలేయిస్తాను" అని అరపు అరిచాడు.

"ఒరి చచ్చునాయనా! దొపదమ్మగారిసీర వొలిచిన యదవరక్తం ఆమె బర్తభీముడు తాగాడుగాని, నీ రక్తం నేను పుడిసిళ్ళ తాగనుట్రా" అంది నీలాలు. నీలాల్ని కన్నెత్తిచూడలేకపోయాడు పెద్దరైతు.

పొలంగట్టునఉన్న ఉప్పరినాగన్న ఇంటిలో ఉప్పర్లందరూ ఆ రాత్రంతా కూచుని కునికిపాట్లు పడుతూవున్నారు.

జడివాన కురుస్తూనే వుంది.

"సింగీ నేలా ఒకటయ్యాయి
కుంగినాయి లోకాలన్నీ.
పెద్దరైతుకు బుద్దేలేదురా.
ఓరన్నా తమ్ముడ నిద్దరపోరా ఆడీగుండెల్లో
నల్లనేలే పరిమళించే
మల్లిపూలూ మొగలీ పూలన్నా!
మొగలిరేకే భూదేవి బాకేరా!
ఓరన్న తమ్ముడ!
మొగలిలోన నాగన్న ఆడేలా!"

వాన పన్నీరుపూచే వాసన. నల్లరేగడ పారిజాత పూలవాసన; గరపనేల మంచిగంధంపరిమళం; ఎఱ్ఱచెక్క నేల అగరువాసనా; ఇసుకనేల పెద్దజాజిపూల సురభిళం, రాతినేల లవంగంవాసనా, పట్టినేల సముద్రంవాసనా, సున్నం నేల దాల్చిన చెట్టుపూవువాసనా వేస్తాయి.

ఈ నేలలో వానలు కురిసినప్పుడు కొంచెం మంచి

గంధం కలిపిన ఆ పూ వాసనలు ప్రసరిస్తాయి. వ్యవసాయం చేసినభూమి దున్నినప్పుడు తుంగముస్తలవాసన గుప్పు మంటుంది.

ఈనేలనుతవ్వేఉప్పర్లకు ఈవాసనలంటేఎంతో ఇష్టం. కాలువలు త్రవ్వి నీరు ప్రవహింపచేసేటప్పుడు వచ్చే సువాసన పూలచెట్లపై తోటమాలి నీళ్ళుపోసేటప్పుడు వచ్చే సువాసన వస్తుంది.

ఈ పరిమళాలన్నీ ఉప్పర్లజీవితాలలో నిండివుంటాయి. నీలాలుకి సుగంధాలు లేవు. మిరపతోటలో వసంతకాలపు జడివాసనే నిండిపోయింది. ఉదయంకాకుండా పొలంలో నాగళ్ళుదింపారు. ఉప్పర్లు దున్నలుకట్టి పొలందున్నేశారు. వాన వారిచుట్టా! మబ్బులూ వారిచుట్టా లేకదా! పొలమూ వారూ ఒకటే, ఎవరయ్యా నీలాలుపొలంలో అడుగుపెట్టేది?

4

పెద్దరైతువల్ల బాధలుపడ్డ ఒకడు నాగన్నను ఖైదు పెట్టిన, సబుజైలు తాలూకాగ్రామం ఆ రాత్రికిరాత్రిపోయి నాగన్న పేరున పెద్దవకీలు ప్రజ్ఞావంతుడు అయిన వీరాస్వామి నాయుడుగారిని కుదిర్చి, ఆయనసలహాపైన ఆయనదగ్గరకు పోలీసు సబ్ ఇనస్పెక్టరుగారిని నావలోనే జట్కాబండిమీాద లాక్కొనివచ్చాడు, వీరాస్వామినాయుడుగారు కథంతా విన్నారు. ఆయనహృదయం కరిగింది. నాగన్నపొలంవద్గిర అల్లరి జరగకుండా చూడవయ్యా అని సబ్ ఇనస్పెక్టర్ని నాయుడుగారు పంపించారు.

నాగన్నవాళ్ళ ఉప్పర్లపల్లె ఒక పెద్దగ్రామానికి శివారు. ఆ గ్రామంలో పెద్దరైతునూరెకరాల ఒక పంపును అంటె నాగన్నమూడెకరాల పంపూ ఉంది. పెద్దరైతుకు ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లో అయిదారువందల యకరాల భూములున్నవి. కలక్టర్లే పెద్దరైతు గాదికింద బంగారం తినే మూషికాలు.

నాగన్నపొలం కాలవగట్టుపొడుగునా ఉంది. ఆ పొలం పెద్దరైతు నూరెకరాలపంపుకూ, కాలవకూ అడ్డుగాఉంది. తెలుచుకుంటే నాగన్న మూడెకరాలలో ఆకుమళ్ళు మిలమిల లాడిపోతూ పోటెత్తుకువస్తాయి. కాలవ వదిలితే అయిదు నిమిషాలలో పొలం తడిసిపోతుంది.

పెద్దరైతు ఈ మూడెకరాలు అమ్మమని కోరాడు. నాగన్న రక్తపుబొట్లులు ధారపోసి కొన్నపొలం ఎల్లా అమ్ముతాడు!

'అమ్మనేను బాబయ్యగారూ' అని మనవిచేశాడు.

ఎంతమందిచేతనో చెప్పించాడు పెద్దరైతు. నాగన్న అందరదగ్గరా 'స్వామే! నా ప్రాణాలా భూమిలో ఉన్నా' యన్నాడు.

పెద్దరైతుకు పంతం వచ్చింది. బెదరించాడు. రెండు రెట్లు ఖరీదిస్తానన్నాడు. బదలాయింపు మంచిభూమి యిస్తా నన్నాడు. నాగన్న పసేమి 'బాబూ! భూమి నా పెద్దబారియ, సిన్నదే సీలా'లని తలపంకించాడు.

"సరే, లమ్డీకొడకా! నీ భూమీ దక్కదు, నీలాలూ నీకు దక్కదురా" అన్నాడు.

నాగన్న కోపంతో వణికాడు. తలవాల్చుకొని తన గూడెంపోయి, నీలాలును తన హృదయానికి అదుముకొని, కంటనీరెట్టాడు.

'ఏంటిబావా! అది' అంది వెర్రినీలాలు. భూదేవి గజ గజలాడింది కాబోలు! ఆ మర్నాడు పెద్దవాన ప్రారంభించింది. వానతో వచ్చి నాగన్నను అరెస్టుచేసి తీసుకుపోయి తాలూకాగ్రామంలో ఖైదుచేశారు పోలీసువారు. దొంగతనం నేరం, మేజస్ట్రేటు దగ్గిర కేసు.

5

ఉరుములూ మెరుపులూ. వాన ఉధృతంతనంవదిలి తుంపరగా మారింది. పడమటివెక్కన తెరిపికనబడింది.

పుట్టింటికి పోకుండా ఉప్పరి నీలాలు భర్తకోసం అత్తవారింట్లోనే ఉంది. నీలాలింటికి పెద్దఉప్పరిపెళ్ళాం వచ్చి నీలాలుకు ఆసరాగా ఉంది.

రిశీవకు నీలాలుకే భూమి కౌలుకిచ్చి చక్కాపోయాడు నీలాలు మర్నాడు సాయంకాలం వానతెరిపి చూచి, పొలం ముదరాకు ఊడ్పిస్తే బాగుంటుందని అనుకొంది.

"ఏకాడ నున్నావు నా బావా!
ఏమి సేత్తున్నావు నా బావా!"

అని అనుకుంది నీలాలు. "చలమయ్యఅన్నమపీడరు గోరిదగ్గరకు పంపినానుకదా! ఇంకా అన్న తనబావ ఊసెట్టుకోని రానేలేదు" అని తనలో మాట్లాడుకుంది.

వెంటనే వెనకాలే వచ్చి ఎవరో కళ్ళుమూశారు.

'యూరది; ఎర్రిదేళాకోళాలు. ఒదిలేయి కళ్ళుమూత్తావేం! ఓ రేవడురా! కుంకె! చంపేత్తా' శక్తిలా తిరిగింది నీలాలు.

ఎదుట నాగన్న నవ్వుతో, "ఎంత బలం ఉందే నీకు పిల్లా! నా యేళ్ళు రగతం వస్తున్నాయి సూడే!" అన్నాడు.

"నాబావే!" అని ఒక్కగంతున అతనిమీద వాలిపోయింది నీలాలు.

"పీడరయంగోరు బేలుమీద ఇడదలచేయించాడు. ఆర్ని నువ్వే పెట్టించావంటగా? నీ మెడలో బంగారుగుళ్ళ పేరు తాకట్టుయెట్టావంట, నువ్వు మాలచ్చివే పిల్లా!" అని నాగన్న పలుకుతూ, నీలాల్ని గుండె కదిమేశాడు.

వాన తగ్గింది. సాయంకాలం యెండ బంగారురంగులు చల్లిందా కౌగిలింతలో ఉన్న దంపతులమీద.

"ఇద్దారి మనసూ ఏకమైపోతే,
పొద్దున్న సూరేడు ముద్దెట్టుపూలు.
ఇద్దారి బతుకును ఏకమైపోతే
సంజేల సూర్యుడు సెంద్రుణ్ణి ఇచ్చు".
భూమి ముసిముసి నవ్వులు నవ్వుకొంది.

—o—